క్లుప్తంగా

వైభవంగా బడేసాహెబ్ నెల ఉరుసు



దర్గాలో భక్తుల సందడి

గోనెగండ్ల : మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ గంజిహళ్లి బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉరుసు మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి వారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా గ్రామంలో తాగు నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. సీఐ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

కోసిగి: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ విభాగం ప్రధానం కార్యదర్శి కె. జిలాని డిమాండ్ చేశారు. శనివారం ఆయన కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంతో ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. వక్ఫ్ భూముల ఆస్తులు పెట్టుబడిదారులు, ఇతరుల ఆధీనంలోకి వెళ్లేలా బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతిపక్షాలు బిల్లును వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా ఆమోదించడం దారుణంగా ఉందన్నారు. సవరణ బిల్లుపై సుప్రీమ్ కోర్టు సుమోటగా న్యాయ విచారణ చేసి ముస్లింలకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు షబ్బీర్, చిన్న జిలానీ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

నందవరం : మండల కేంద్రం నందవరంలోని సరళవీధి, వంకగడ్డ వీధిలో మూడు నెలల నుంచి కుళాయిలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై కాలనీ వాసులు గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, ఉప సర్పంచ్ శివప్పగౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఉప్ప సర్పంచ్ నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. శనివారం కాలనీలో కుళాయి పైపులకు మరమ్మతు చేపట్టి ఆ కాలనీలకు నీటి సరఫరా పునరుద్ధరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చాంద్‌తాత, సరళన్న, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనుండాలి

కౌతాళం: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉన్నప్పుడే తగదాలు జరగవని సీఐ అశోక్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై, సైబర్ నేరాలపై, ఆస్తి తగదాలపై ప్రజలకు అవగహన కల్పించారు. వీటిపై ప్రతి పౌరుడికి అవగహన ఉంటే గ్రామాల్లో ఎలాంటి సమస్యలు రావన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ఆస్తి తగదాలను గ్రామస్తులే సామరస్యంగా పరిష్కారించుకోవాలని ఎవరి స్థలాన్ని, భూములను ఎవరు కూడా అక్రమించకూడదని సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

కోసిగి: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని కోసిగి ఎస్‌ఐ హనుమంత రెడ్డి వాహనదారులకు సూచించారు. శనివారం స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయ గ్రౌండ్‌లో ఆటో డ్రైవర్లుకు, వాహనదారులకు సైబర్ స్మార్ట్, రోడ్డు సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక వాహన పరిమిట్లు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పక అనుమతి పొందాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

యాప్‌లో సమస్యలను పరిష్కరించాలి

ఆదోని రూరల్: ప్రభుత్వం తీసుకొచ్చిన బాల సంజీవని యాప్ 2.0 వెర్షన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘం నాయకులు జానకి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త యాప్‌లో నెలకొన్న సమస్యల కారణంగా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేక పోతున్నామన్నారు. యాప్‌లో మార్పులు చేసి సక్రమంగా పనిచేసేలా చూడాలని కోరారు.

14న అంబేడ్కర్ జయంతి

ఆదోని రూరల్: ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆదోని ఎంఐఎం టౌన్ ప్రెసిడెంట్ జునేద్, ఆదోని మాల మహానాడు పట్టణాధ్యక్షుడు బొబ్బిలి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి రోజున పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ విగ్రహం వద్ద నుంచి శ్రీనివాసభవన్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. అందరూ ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం షేక్ ఖాదర్‌బాషా, లబ్బైక్, మన్సూరు తదితరులు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్ !

- లబ్ధిదారులందరికీ అందని రేషన్ బియ్యం
- షాపుల వద్ద పడిగాపులు గాయాల్సిన పరిస్థితి
- చిర్తనకల్లులో డీలర్ వద్ద నాలుగు రోజుల్లోనే రేషన్ బియ్యం ఖాళీ
- దాదాపు 110మంది కార్డుదారులకు అందని వైనం
- ఆందోళనలో కార్డుదారులు



రేషన్ బియ్యం అందలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్న చిర్తనకల్లు గ్రామస్తులు



రేషన్ షాపు వద్ద కార్డులను వరుసలో పెట్టేందుకు పోటీపడుతున్న లబ్ధిదారులు

కోసిగి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చౌకధర దుకాణాల్లో నిరుపేదలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లో కేవలం రేషన్ బియ్యం మాత్రమే చేస్తున్నారు. అది కూడా సక్రమంగా అందకపోవడంతో గ్రామాల్లో పేదలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎండీయూ వాహనాలు కనుమరుగైపోయి లబ్ధిదారులు రేషన్ షాపుల వద్దకు వెళ్లి పడిగాపులు కాయాల్సి వస్తోంది. అయినా బియ్యం పూర్తి స్థాయిలో అందకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. పలు గ్రామాల్లో 3, 4 రోజులు పంపిణీ చేసి కోటా అయిపోయిందని డీలర్లు చేతులెత్తేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిత్యావసర సరుకులు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇంటి వద్ద వచ్చి అందించే వారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

మండలంలో 17వేల కార్డుదారులు

కోసిగి మండలంలో దాదాపు 17వేల కార్డుదారులు ఉన్నాయి. వీరందరికీ మండలంలో 42 రేషన్ షాపులు, 13 మంది ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్ షాపుల వద్ద పంపిణీ చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1 నుంచి 15వ తేదీ వరకు ప్రజలకు అందుబాటు ఉండి నిత్యావసర సరుకులు అందించాల్సి ఉంది. కానీ కోసిగి మండలంలో అందుకు విరుద్ధంగా పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో ఎండీయూ ఆపరేటర్‌కు 3 నుంచి 4 రేషన్ షాపుల పంపిణీ చేయాల్సి ఉంది. 15 రోజుల్లో పంపిణీ పూర్తి చేసేందుకు ఒక్కొక్క రేషన్ షాపునకు రెండు నుంచి మూడు రోజులు మాత్రమే కేటాయించాల్సి వస్తోంది. దీంతో ప్రజలందరూ మూకుమ్మడిగా రేషన్ షాపుల వద్దకు వెళ్లి బియ్యం కోసం పనులు మానుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్డులను వరుసలో పెట్టి పడిగాపులు కాస్తూ అవస్థలు పడుతున్నారు. కొన్ని సమయాల్లో రేషన్ కోటా బియ్యం పూర్తి అయిపోయింది, ఇతర రేషన్ షాపులకు వెళ్లాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు చెబుతున్నారు. ప్రధానంగా మేజర్ పంచాయతీ కోసిగిలో 14 షాపులు ఉండగా.. కార్డులు పట్టుకుని లబ్ధిదారులు ఆ షాపు, ఈ షాపు చుట్టూ తిరుగు నానా అవస్థలు పడుతున్నారు. అయినా కొందరికి రేషన్ బియ్యం అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిర్తనకల్లులో అందని రేషన్ బియ్యం

మండలంలోని చిర్తనకల్లు గ్రామంలో 500 రేషన్ కార్డుదారులు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెల 81క్వింటాళ్లు రేషన్ బియ్యం కేటాయిస్తున్నారు. ఈనెల ఆ గ్రామానికి 51 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని, ఉన్న కాటికి రేషన్ సరఫరా చేశామని డీలర్లు చేతులు ఎత్తివేశారు. దాదాపు 110 కార్డులు రేషన్ బియ్యం అందలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. బియ్యం లేక పోతే ఏమి తినాలని బతకాలని ఆ గ్రామానికి చెందిన రవిరాజు, దేవదానం, స్వామి దాసు, రంగమ్మ, నిర్మల, దేవమణి, భాగ్యరతి శనివారం రేషన్ షాపు వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు రేషన్ షాపు వద్ద క్యూ లైన్‌లో వేచి ఉన్నా చివరి బియ్యం అయిపోయాని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయం పై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి పేద ప్రజల అందించే రేషన్ బియ్యం ఇబ్బందులు లేకుండా సక్రమంగా అందించేలా చూడాలని వివిధ గ్రామాల ప్రజలు కోరారు.

ఉదయం నుంచి పడిగాపులు కాశా



రేషన్ డీలర్ షాపు కార్డు లైన్‌లో ఉంచి ఉదయం నుంచి సాయంత్రం వద్ద వేచి ఉన్నాను. చివరికి సాయంత్రం రేషన్ బియ్యం అయిపోయాయని డీలర్ చెబుతున్నాడు. ఈనెల కోటా బియ్యం లేక పోతే ఎలా బతకాలి. ఏమి తినాలి. ప్రభుత్వం ఇచ్చేది బియ్యం ఒక్కటే అది కూడా ఇవ్వక పోతే ఏమిటని ఆరోపించాడు.

– లాజర్, చిర్తనకల్లు

బియ్యం వేయకపోతే ఏమి తినాలి



రేషన్ బియ్యం కోసం ప్రతి నెలా రేషన్ షాపుల వద్ద పొద్దున్నుంచి సాయంత్రం వరకు వేచి ఉండి తెచ్చుకుంటున్నాం. ఈనెల రేషన్ షాపు వద్ద వెళ్లి అడిగితే బియ్యం కోటా అయిపోయిందని చెబుతున్నారు. మా కుటుంబ సభ్యులు బియ్యం లేక పోతే ఏమి తిని బతకాలి. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. అధికారులు స్పందించి మాకు బియ్యం అందించాలి.

– సంతోషమ్మ, చిర్తనకల్లు

అందరికీ అందించేలా చూస్తాం



ఏప్రిల్ నెలకు సంబదింధించిన రేషన్ బియ్యం కోటా అన్నీ రేషన్ షాపులకు వచ్చేసింది. లబ్ధిదారులు రేషన్ బియ్యం ఏ షాపులో నైనా వేసుకోవచ్చును. చిర్తనకల్లు గ్రామంలో రేషన్ బియ్యం కోటా వచ్చింది. అయితే ఆ గ్రామ డీలర్‌కు గతనెలలో సంబంధించిన బ్యాక్‌లాగ్ కోటా ఉంటుంది. ఆ బియ్యం కలిపి ప్రజలకు అందించాల్సి ఉంది. విచారణ చేసి కార్డు దారులందరికీ రేషన్ బియ్యం అందించేలా చూస్తాం.

– రుద్రగౌడ, తహసీల్దార్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ నూతన కమిటీ సభ్యులను సత్కరించిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ పట్టణ నూతన కమిటీ సభ్యులు పార్టీని మరింత బలోపేపం చేసేందుకు కృషి చేయాలని పార్టీ వీరశైవలింగాయత్ విభాగం అధ్యక్షుడు రుద్రగౌడ్ సూచించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన మాచాని వెంకటేష్‌ను నియోజకవర్గ అధ్యక్షుడు నీలకంఠ, ఐటీ విభాగం అధ్యక్షుడు మాచాని సోమేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, బజారిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు అంజి, కరెరాము, కార్యదర్శులు గురువయ్య మాబ్బాష, రఘువీర్, అల్తాఫ్, బోయ సోమేష్, బంటుపల్లి ప్రభాకర్, దొరబాబులను సత్కరించారు. పార్టీ పదవులు చేపట్టిన వారు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు సునీల్‌కుమార్, షరీఫ్, ఫయాజ్, పామయ్య, లతారెడ్డి,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

ఎమ్మిగనూరురూరల్: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సాయిపోగు సోనమ్(24) అనే మహిళ శనివారం మృతి చెందింది. వివరాలు.. ముంబాయిలోని చౌకివార్సివా ప్రాంతానికి చెందిన సాయిపోగు సోనమ్(24) భర్త నాగేష మద్యానికి బానిసై వేధింపులకు గురిచేస్తుండటంతో అతన్ని వదిలి ఎమ్మిగనూరుకు పారిపోయి వచ్చింది. ఆరు నెలలుగా పట్టణంలోని మహాలక్ష్మి లేడిస్ హాస్టల్ ఉంటోంది. ఆమెకు గర్భం రావటంతో తొలగించుకునేందుకు గత నెల 29న కాల్షియం, ఐరన్ మాత్రలు అధిక మోతాదులో వేసుకోవటంతో అపార్మకస్థితిలోకి వెళ్లింది. హాస్టల్ నిర్వహకులు గుర్తించి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టౌన్ సీఐ వి. శ్రీనివాసులు శనివారం సాయంత్రం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వెల్లడించారు.

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: క్రీడలు మానసికోల్లాసం, ప్రశాంతతను ఇస్తాయని ఆదోని రెండవ అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ అన్నారు. శనివారం దివంగత న్యాయవాదులు శ్రీనివాసరావు, ఇస్మాయిల్, ఎల్.కె.సుందర్‌సింగ్, సర్దార్ అహ్మద్, టి.నాగరాజు జ్ఞాపకార్థం ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రికెట్ ఆడి ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో ఆదోని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి జీవన్‌సింగ్, సీనియర్ న్యాయవాదులు మజహర్ ఉల్ హక్, వై.ఆర్.మల్లికార్జున, గిరిధర్, తబరేజ్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించి దళితులపై దాడి

ఆదోని రూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామానికి చెందిన దుర్గప్ప, ఉలిగప్ప, బొజ్జప్ప అనే ముగ్గురు దళితులపై అదే గ్రామానికి చెందిన కడుబూరు హనుమం, కడుమూరు నాగరాజు, కడుమూరు రవి, కడుమూరు రామంజి, పింజరి అబ్బాస్ అలీలు కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని బాధితులు వాపోయారు. రేషన్ వేయరాదని రెవెన్యూ అధికారులు సదరు డీలర్‌కు ఆదేశాలు ఇచ్చారని, అదేవిషయాన్ని అడగడానికి వెళ్లిన తమపై అకారణంగా కులం పేరుతో దూషించి దాడి చేశారన్నారు. ఈ విషయంపై ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు రుద్రగౌడ్, రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబ్‌కలెక్టర్, అధికారులు



ఆదోనిలో బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ ఫెడరేషన్ నాయకులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



కౌతాళంలో దళిత సమైక్య సంఘం ఆధ్వర్యంలో చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



కౌతాళంలో జైభీమ్ ఆధ్వర్యంలో ..

ఆదోని రూరల్: భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. శనివారం బాబుజగ్జీవన్‌రాం జయంతిని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రాలయం తహసీల్దార్ రవి, ఉప తహసీల్దార్ వినీత్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ అశోక్, సీనియర్ సహాయకులు రామచంద్ర, ఖాసీం, డివిజనల్ గణాంకాల అధికారి లక్ష్మజీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- ఆదోని పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బాబుజగ్జీవన్‌రాం జయంతి వేడుకలను కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం, ప్రిన్సిపాల్ అబ్దుల్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డా.సలోమీ, సౌజన్య, విజయకుమారి, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: స్థానిక ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌లో జరిగిన బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మిల్టన్ గ్రామర్ హైస్కూల్‌లో జగ్జీవన్‌రామ్ జయంతిని పాఠశాల కరస్పాండెంట్ హెచ్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఈఓ బి.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్‌రంగస్వామి, ఇన్‌చార్జ్ సుశీల, లావణ్య, జయసింహా, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో యూనియన్ నాయకులు బాబుజగ్జీవన్‌రాం చిత్రపటానికి ఎస్టీయూ నాయకులు నాగరాజు, రమేష్‌నాయుడు, వీరచంద్రయాదవ్, మహాదేవప్ప, సుంకన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ..

ఆదోని టౌన్: పట్టణంలో ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరినాయుడు, నాయకులు బండారి రాజేశ్వరరావు, కపటి వీరబద్ర, ఎం.రామకృష్ణ, గడిగ రాందాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మణి మంజరి, గోనెగండ్ల బస్టాండ్‌లో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అధ్యక్షతన బాబు జగ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏపీఎం హేమలత, కేవీపీఎస్, ఆటో యూనియన్ నాయకులు వీరేష్, రాఘవేంద్ర, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ఘనంగా వేడుకలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిషత్ కార్యాలయం అవరణలో శనివారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల సమాజ అభ్యూనతికి తన జీవితాన్ని ధారపోసిన మహానేత జగ్జీవన్ రామ్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వీరశైవలింగాయత్ విభాగం అధ్యక్షుడు రుద్రగౌడ్, పార్టీ మేధావుల పోరం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, చేనేత, బీసీ విభాగ రాష్ట్ర కార్యదర్శులు మాచాని వెంకటేష్, విరుపాక్షిరెడ్డి, చేనేత జిల్లా అధ్యక్షుడు ఎంకే శివ ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్పతో పాటు పట్టణ నాయకులు, కౌన్సిలర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, మల్లికార్జున రెడ్డి, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు ఖాశింబేగ్‌తో పాటు పలువురు పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో

స్థానిక మోహన్ ఫంక్షన్ హాల్‌లో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు,రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, జిల్లా నాయకులు పాటిల్ ఈశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, ఎల్లప్ప, అడివన్న, కేవీపీఎస్ కార్యాలయంలో ప్ర జా, దళిత సంఘాల నాయకులు ఎస్.దేవసహాయం, పరిగెల ప్రభాకర్‌లు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు.

నందవరం:స్థానికతహసీల్దార్ కార్యాలయంలో డి ప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్ , రెవెన్యూ సిబ్బంది జగ్జీవన్ రామ్‌చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థులకు సమక్షంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు జగజ్జీవన్ రామ్ జయంతిని ఘన ంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్ప మాదిగ, రా మన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, మ ండల ఉపాధ్యక్షులు ప్రకాష్, ఈరన్న పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు భాగంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బాబు జగజ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం మండల అధ్యక్షులు మంచోది ఆదాము, యోహోనూ, ఆనందు, లోకయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం : మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనంలో జైభీమ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. అవతారం, పాల్ దినాకర్‌ల ఆధ్వర్యంలో, ఆంధ్ర ప్రదేశ్ దళిత సమైక్య ఆధ్వర్యంలో వేర్వేరుగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతిని జరుపుకున్నారు. దళిత సమైక్య నాయకులు విజయ మోహన్ కుమార్, ముఖేష్ తిమోతి, కార్తికి ప్రకాష్, మారెప్ప, అబ్రహాం, ఈరన్న, నాగరాజు, ఉదయ్‌లు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు ఎంపీడీఓ కార్యాలయం అవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న



కోసిగిలో బాబు జగ్జీవన్ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పెద్దకడబూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ మణి మంజరి



నందవరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీటీ శశిశేఖర్



ఎమ్మిగనూరు కేవీపీఎస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ప్రజా సంఘాల నాయకులు



ఎమ్మిగనూరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీటీఎఫ్ నాయకులు



నివాళులర్పిస్తున్న ఎస్టీయు నాయకులు